ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.4

యాదాద్రి భువనగిరి

5

శనివారం 10 ఆగస్టు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	587.70 (305.9222)	4,13,660	3,06,090
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.55 (3.58)	289.35	92.70
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	167.78 (35.28)	2,30,195	2,42,278

చికెన్ ధరలు | లైవ్ : రూ.108 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.200

సుంకిశాలపై రాజకీయ దుమారం

సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ (రక్షణగోడ) కూలిన ఘటనపై రాజకీయ దుమారం చెలరేగుతోంది. హైదరాబాద్ మహానగరానికి వేసవిలోనూ తాగునీటినందించే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును హడావిడిగా చేపట్టడం వల్లే ప్రాజెక్టు పనుల్లో డిజైన్ లోపాలు, నాణ్యత లోపించి ప్రమాదానికి దారితీసిందని అధికార కాంగ్రెస్ విమర్శిస్తోంది. గోడకూలిందీ, పనులు జరుగుతున్నదీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనేనని, ఈ ప్రభుత్వానికి, పెద్దలకు అవగాహనరాహిత్యమే ప్రమాదానికి కారణమని బీఆర్‌ఎస్ ప్రతివిమర్శలు చేస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సుంకిశాల వద్ద పంప్‌హౌస్‌లో నీటమునిగిన రక్షణ గోడ

ప్రాజెక్టే అనవసరంగా చేపట్టారని విమర్శిస్తోన్న కాంగ్రెస్ ›› బాధ్యత వహించకుండా తప్పించుకునేందుకే ఈ వాదన చేస్తున్నారని బీఆర్‌ఎస్ కౌంటర్

హైదరాబాద్ మహానగరానికి తాగునీటిని అందించే ఈ పథకంపై మొదటి నుంచి వివాదాలే ముసురుకున్నాయి. ఈ పథకమే వద్దని 1994లో ప్రజలు ఆందోళనలు చేయడం వల్లే ఇటు నల్లగొండ జిల్లా రైతాంగానికి సాగునీరు, తాగునీటితోపాటు, హైదరాబాద్‌కు తాగునీటిని అందించేందుకు ఎస్ఎల్‌బీసీకి సమాంతరంగా అప్పట్లో ఏఎమ్మార్పీ లిఫ్టును చేపట్టామని, దాన్నుంచి ఇస్తున్న నీటితో హైదరాబాద్‌కు సరిపడా తాగునీరందుతోందని, కేవలం కమీషన్ల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసమే సుంకిశాల ప్రాజెక్టును వేసవిలో నీటికొరత పేరుతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెరమీదకు తెచ్చిందని బలంగా ఆరోపిస్తుండడం తాజాగా చర్చకు దారితీసింది.

సాగర్ ప్రాజెక్టులో నీరు తగ్గితేనే మళ్లీ పనులు ముందుకు

సుంకిశాల ప్రాజెక్టు పనులు దాదాపు 70శాతం పూర్తవగా, ఇంకా 30శాతం పెండింగ్‌లో ఉన్నాయి. కీలకమైన మిడ్ టన్నెల్ పంపుహౌస్ తాజాగా గోడకూలిన ఘటనతో నీటమునిగింది. ఈ పనులు మళ్లీ మొదలవ్వాలంటే నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిగా తగ్గాల్సి ఉంటుందని, దాదాపు ఫిబ్రవరి వరకు పనులు చేపట్టడం కష్టమేనని తెలుస్తోంది. అయితే సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీ, ఇంజనీర్లు మాత్రం రెండు నెలల్లో పనులు పునః ప్రారంభిస్తామని చెబుతున్నారు. తాజాగా ఆగస్టు 1న జరిగిన ప్రమాదంలో సుంకిశాల ప్రాజెక్టులో రెండో పంపుహౌస్ రిటైనింగ్ వాల్ కూలి న ఘటనలో ప్రాణనష్టం జరగలేదు. కానీ గోడ కూలిపోవడంతోపాటు, దాంట్లో ఉన్న యంత్రాలు, పంపులు నీటమునిగాయి. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం తగ్గితే తప్ప ఈ పంపుహౌస్‌లోకి వచ్చేనీటిని ఆపలేరు. ఇంజనీర్లు పేర్కొంటున్న ప్రకారం.. ఇక్కడ ప్రతిపాదించిన మూడు టన్నెళ్లలో మిడ్‌టన్నెల్ పనులు పూర్తి చేసేందుకు పనులు చేపట్టారు. దీంట్లో భాగంగా సంప్ వైపు టన్నెల్ పై గేటు ఏర్పాటు చేశారు. రిజర్వాయర్ వైపు మట్టిని తొలిచారు. అదే సమయంలో రక్షణగోడల నడుమ టై బీమ్ అనుసంధాన పనులు, మధ్య టన్నెల్ కోసం గేట్ బిగింపు పనులు కొనసాగిస్తున్న క్రమంలోనే ఆ పనులు పూర్తి కాకముందే రిజర్వాయర్‌కు భారీగా వరద ప్రవాహం రావడంతో టన్నెల్‌లోకి వరద ఉధృతి వచ్చింది. దీంతో టన్నెల్ గేటు కొట్టుకుపోవడమే కాకుండా, దానికి అనుసంధానమైన సైడ్‌వాల్ (రక్షణగోడ) కూలిపోయింది. రిజర్వాయర్ సంప్ పూర్తిస్థాయిలో నీటితో నిండిపోయింది. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం తప్పింది. అయితే ఈ ప్రమాదంతో సుమారు రూ.20కోట్ల వరకు ఆస్తినష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రూ.20కోట్ల విలువైన పనులు మళ్లీ చేపట్టాల్సి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రమాద నష్టం పూర్తిగా కాంట్రాక్ట్ సంస్థే భరిస్తుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

కమీషన్ల కోసమే ప్రాజెక్ట్ నిర్మాణం

ఏఎమ్మార్పీ అక్కంపల్లి రిజర్వాయర్ నుంచే హైదరాబాద్‌కు సరిపడా మంచినీరు సరఫ రా అవుతుందని, సుంకిశాల ప్రాజెక్టును గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం కమీషన్ల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసమే చేపట్టిందని మంత్రులు, కాంగ్రెస్‌నేతలు విమర్శిస్తున్నారు. శుక్రవారం ప్రాజెక్టును సందర్శించిన సమయంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం ఇదే అభిప్రాయాన్ని వెల్లడించారు. తాను ఈపథకం చేపట్టిన సమయంలోనే ఇది అనవసరమని అప్పటి ప్రభుత్వానికి సూచించానని, సాంకేతికంగానూ ఇది సరైన డిజైన్ కాదని సుఖేందర్‌రెడ్డి స్పష్టంచేయడం గమనార్హం. ఎన్నికలకోసం హడావిడిగా పనులు చేయించి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరించడం ఎంతవరకు సమంజసమని మంత్రులు, చైర్మన్ ప్రశ్నించారు. ఇదే అంశంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి అవగాహన లేకపోవడం, అధికారులు చెప్పినట్లు వినకుండా ఆగమాగంగా గేట్లు పెట్టాలని ఒత్తిడి చేయడం వల్లే ప్రమాదం జరిగిందని విమర్శించారు. మొత్తంగా మొదటినుంచి వివాదాలతో ఉన్న ఈ ప్రాజెక్టు తాజాగా గోడకూలిన ప్రమాదంతో మరోసారి రాజకీయ దుమారానికి కారణమైంది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పూర్తి చేస్తే, సుంకిశాల ప్రాజెక్టు అవసరమే లేదని, గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎస్ఎల్‌బీసీ సొరంగంపై కనీస దృష్టి పెట్టలేదని, సుంకిశాలకు వెచ్చించిన సొమ్ము ఎస్ఎల్‌బీసీకి కేటాయించినట్లయితే ఇటు నల్లగొండ కు సాగు, తాగునీటితోపాటు, ఏఎమ్మార్పీ ద్వారా హైదరాబాద్ కు తాగునీటికి ఢోకాలేకుండా పోయేదని కేసీఆర్ దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపై చూపిన వివక్షవల్లే ఈ దుస్థితి తలెత్తిందని కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు విమర్శిస్తున్నారు.



ప్రాజెక్ట్ వద్ద మంత్రి ఉత్తమ్, శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రం అప్పులపాలు

● మహిళా సహకార అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి



ఆలేరులో విలేకరులతో మాట్లాడుతున్న శోభారాణి

ఆలేరు రూరల్, ఆగస్టు 9: పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలుచేసి దివాలా తీయించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని మహిళా సహకార అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి అన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి ఆలేరుకు వచ్చిన ఆమె దుర్గామాత ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్లపాటు బీఆర్‌ఎస్ నిరంకుశ పాలన కొనసాగిందన్నారు. తన 30ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజాప్రభుత్వంలో భాగస్వామ్యంకావడం ఆనందంగా ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఆలేరు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఎంతోమంది విద్యార్థులు, యువకులు ఆత్మ బలిదానాలు చేసుకున్న నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైందన్నారు. తమ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిందని, డీఎస్సీ ద్వారా 25వేల ఉద్యోగాలను భర్తీ చేయనుందన్నారు. నియోజకవర్గ కేంద్రంలో పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో సాంబిరెడ్డి, ఎండీ సలీం, దడిగె ఇస్తారి, ఆరె రాములు, నరేందర్, గౌస్, అనిత పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు



క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు

భువనగిరి టౌన్, ఆగస్టు 9: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భువనగిరి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో రోజువారీ పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. కోర్టు విధుల్లో అలసిపోయే న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు తప్పనిసరిగా మైదానాల్లో ఆటలు ఆడాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరినాథ్ పాల్గొన్నారు.

జైలు ఖైదీలకు న్యాయసేవలు

జైలు ఖైదీలకు న్యాయ సహాయ కేంద్రం ద్వారా న్యాయసేవలు అందించనున్నట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మాధవిలత అన్నారు. భువనగిరి సబ్‌జైల్‌ను పరిశీలించి రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. సబ్ జైల్ సూపరింటెండెంట్, న్యాయవాదులు ఆమె వెంట ఉన్నారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

భువనగిరి అర్బన్, ఆగస్టు 9: స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం భారత స్వాతంత్ర్య వేడుకలపై అధికారులతో సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 15న జిల్లా కేంద్రంలోని భువనగిరి జూనియర్ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య వేడుకలు విజయవంతం చేయాలన్నారు. పోలీస్ గౌరవ వందన స్వీకరణ, బందోబస్తు ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. వేదిక, కుర్చీలు, తాగునీరు, పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్‌సీసీ కేడెట్ మార్చ్‌ఫాస్ట్, మైదానంలో మెడికల్ టీంతో అత్యవసర సేవలు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, భువనగిరి ఆర్డీవో పి.అమరేందర్, కలెక్టరేట్ ఏవో జగన్మోహన్‌ప్రసాద్, పోలీసు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కొమురం భీం, సంత్ సేవాలాల్ సందేశాలను నేటి విద్యార్థిలోకం అర్థం చేసుకొని సమాజ శ్రేయస్సుకోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే. గంగాధర్, సంతోష్‌నాయక్, చంద్రభాను నాయక్, రాంజీనాయక్, రాజేంద్ర నాయక్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీబీనగర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు ఒకపూట భోజనం చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ఆయన హాజరయ్యారు. ఓ చిన్నారికి అన్నప్రాసన చేశారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం'లో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, సీడీపీవో శైలజ, సూపర్‌వైజర్ అరుణ పాల్గొన్నారు.

శాకంబరి దేవిగా అమ్మవారు



శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని వలిగొండ మండల కేంద్రంలోని హరిహర త్రిశక్తి క్షేత్రంలో అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు చేరుకొని పూజల్లో పాల్గొన్నారు.

● వలిగొండ

వలిగొండలో శాకంబరిదేవిగా అమ్మవారు

జీరో బిల్లు.. తెచ్చెను వెలుగు

›› ప్రభుత్వ పాఠశాలలకు జీరో బిల్లులు అమలు చేయనున్న ప్రభుత్వం

›› ఇక డిజిటల్ పాఠాలు సులభతరం



తరగతి గదిలో డిజిటల్ పాఠాలు వింటున్న విద్యార్థులు

భువనగిరి రూరల్, ఆగస్టు 9: ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలలకూ జీరో విద్యుత్ బిల్లు అమలు కానుంది. రైతులు, పేదలకు ఇస్తున్నట్లుగానే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా ప్రభుత్వ పాఠశాలలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. విద్యుత్ బిల్లులు చెల్లించలేక ఇన్నాళ్లు.. డిజిటల్ పాఠాలకు విద్యార్థులు దూరమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగానే ఉచిత కరెంటు అమలు చేస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మనున్నాయి. అయితే జిల్లాలో ట్రాన్స్‌కో అధికారుల లెక్కల ప్రకారం 2024, జూన్ 31నాటికి 654 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి రూ.75.23లక్షలు బకాయిలున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.లక్షల్లో బకాయిలు

'మన ఊరు-మన బడి', 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీల ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్యాన్లు, లైట్లు, బోరు పంపులు, వాటర్ ప్లాంట్లు ఏర్పాటుచేశారు. అంతకు ముందే డిజిటల్ విద్యలో భాగంగా ప్రొజెక్టర్లు, కంప్యూటర్లు పాఠశాలల్లో ఉన్నాయి. మరోవైపు అధికారులు పాఠశాలలకు కేటగిరి-7ఏ కింద విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. పాఠశాలల్లో సెలవుల్లో మినహా విద్యుత్ వాడకం తప్పనిసరి కావడంతో బిల్లులు పెరుగుతున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నెలకు రూ.800నుంచి రూ.1,100వరకు, ఉన్నత పాఠశాలల్లో గదులు, డిజిటల్ క్లాసులు, విద్యార్థులు ఎక్కువగా ఉండడంతో సుమారు రూ.1,800నుంచి రూ.2,500వరకు, కస్తూర్బా గాంధీ, మోడల్ పాఠశాలలకు దాదాపు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. పాఠశాలల నిర్వహణ నిధులు సరిపోకపోవడంతో ఇన్నాళ్లూ ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ నిర్ణయంతో ఇక కష్టాలు తొలగినట్లే.

నిర్వహణకు సరిపోని నిధులు

ప్రభుత్వ పాఠశాలలకు ఏటా విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.10వేల నుంచి రూ.75వేల వరకు నిర్వహణ నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఈ నిధులు జాతీయ పండుగలు, కంప్యూటర్లు, ల్యాబ్‌ల నిర్వహణ, స్టేషనరీ, విద్యుత్ బిల్లులు, మరమ్మతులు, నెట్‌చార్జీలు, తాగునీరు తదితర సదుపాయాలకు సరిపోవడంలేదని ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లిస్తే, మిగిలిన వాటికి ఒక్క పైసా కూడా మిగలడం లేదని వాపోతున్నారు. దీంతో పెద్ద మొత్తంలో విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకపోతున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో పాఠశాలల నిర్వహణకు నిధుల కొరత తప్పనుంది.

బిల్లుల సమస్య తీరుతుంది



ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తామని సీఎం ప్రకటించడం హర్షనీయం. ప్రధానోపాధ్యాయులందరం ఈ విషయాన్ని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ తాజా నిర్ణయంతో బిల్లుల సమస్య తీరనుంది. పాఠశాలల నిధులను ఇతర అవసరాలకు వినియోగించే వీలుంది.

- చింతపల్లి సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, బాగాయత్ హైస్కూల్

రూ.75.23లక్షల బకాయిలు

జిల్లాలో 654 పాఠశాలలకు విద్యుత్ కనెక్షన్లున్నాయి. 2024, జూలై31 నాటికి రూ.75.23 లక్షల బకాయిలున్నాయి. అయితే ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించింది. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు జిల్లాలో పాఠశాలలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లు, తదితర బకాయిలకు సంబంధించిన నివేదికల ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

- మల్లికార్జున్, డీఈఈ, టీజీఎస్‌పీడీసీఎల్

గ్రామాల అభివృద్ధికే 'స్వచ్ఛదనం-పచ్చదనం'



గుండాల ఎంపీడీవో కార్యాలయం ఎదుట మొక్కను నాటుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

గుండాల, ఆగస్టు 9: గ్రామాల సమగ్ర అభివృద్ధికోసం ప్రభుత్వం కృషి చేస్తోందని అందులో భాగంగానే ప్రభుత్వం 'స్వచ్ఛదనం - పచ్చదనం' కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి, వాటిని సంరక్షించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతీ ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మండలకేంద్రంలోని వివిధ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండలకేంద్రంలోని ఆదర్శపాఠశాలల్లో నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జలకుమారి, ఎంపీడీవో దేవిక, ఏవో లావణ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరిగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏలూరి రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం, మాజీ ఎంపీపీలు ద్యావ కృష్ణారెడ్డి, సంగి వేణు, హరితదేవి, ఆల్దా మాజీ డైరెక్టర్ ఇమ్మడి దశరథ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయభేరి మోగించేందుకు కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని రాయిపల్లిలో గౌడ సంఘం, ఆత్మకూరు(ఎం)లో నాయీబ్రాహ్మణ సంఘం భవనాలకు, సారగండ్ల గూడెంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. నీటిశుద్ధి యంత్రాన్ని ప్రారంభించి, మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీవో రాములునాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ, మాజీ జడ్పీటీసీ కె.నరేందర్, జె.నగేష్, పి.మల్లేశం, ఏపీవో బి.రమేష్, ఎన్.వెంకట్‌రెడ్డి, డి.నర్సింహాచారి, డి.నవ్య పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: మొక్కలు నాటడం భావితరాల కోసమేనని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని సైదాపురం వీరభద్రస్వామి ఆలయం ప్రాంగణంలో 'స్వచ్ఛదనం-పచ్చదనం'లో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం మాజీ సర్పంచ్‌లు బీర్ల శంకర్, భీమగాని రాములు గౌడ్, మాజీ ఉప సర్పంచ్ దుంబాల సురేఖవెంకట్‌రెడ్డి, నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి: నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని డిప్లొమా కోర్సుల్లో ప్రథమ సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ల పొందేందుకు అర్హులైన విద్యార్థులు ఈ నెల 8 నుంచి 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ నరసింహారావు తెలిపారు. పాలీసెట్‌లో అర్హత సాధించిన వారు, దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు 12వ తేదీన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేదీ ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.


అనిరుధ్ (ఫైల్)

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం


ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతో పాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షను కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికీ 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

'రుణమాఫీ'లో సహకార సంఘాల చేతివాటం?

● నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో రెండు సొసైటీల్లో వెలుగులోకి

నల్లగొండ, ఆగస్టు 9 : ఇప్పటికే రెండు దశలలో అమలుచేసిన పంటల రుణమాఫీకి సంబంధించి నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని రెండు ప్రాథమిక సహకార సంఘాల(పీఏసీఎస్)లో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఆయా సంఘాల్లో చేతివాటం ప్రదర్శించినట్లు ఆ శాఖ అధికారులతో పాటు డీసీసీబీ అధికారులు గుర్తించారు. ఆయా సొసైటీల్లో కార్యదర్శుల పాత్రపై విచారణ నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మరిన్ని సొసైటీల్లో అక్రమాలు బయటపడే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు ఆయా సొసైటీల కార్యదర్శులకు సంజాయిషీ నోటీసులను జారీ చేసి వాటి నుంచి వివరణ తీసుకోనున్నారు. అక్రమాలుగా తేలితే చర్యలు తీసుకోనున్నారు. రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 2018 డిసెంబరు 12వ తేదీతో పాటు 2023 డిసెంబరు 9వ తేదీ మధ్యకాలంలో రుణాలు పొందిన, రెన్యూవల్ చేయించుకున్న రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుంది. కానీ ఆ రెండు సొసైటీల్లో ప్రభుత్వం నిర్దేశించిన కాలంలో రుణాలు మంజూరు కానీ, రెన్యూవల్ కానీ జరగలేదని తెలుస్తోంది. అయినప్పటికీ ఆయా సొసైటీల కార్యదర్శులు రైతుల రుణాలు తీసుకున్నట్లుగా ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు సమాచారం. నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలోని ఓ మండల కేంద్రంలోని పీఏసీఎస్‌కు చెందిన కార్యదర్శి ఇప్పటికే సస్పెండ్‌కు గురైనట్లు తెలిసింది. రుణమాఫీకి సంబంధించి రిపోర్టు పంపడం కోసం ఓ ఉద్యోగికి బాధ్యతలు అప్పగిస్తే అతను రిపోర్టు ఆలస్యంగా పంపాడా అనర్హుల లిస్టు పంపాడా అన్న దానిపై సందేహాలు రావడంతో అధికార యంత్రాంగం విచారణ జరిపినట్లు వినికిడి. సహకార అధికారులు మాత్రం ఆ సొసైటీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని డేటా ఆలస్యంగా పంపారని పేర్కొంటున్నారు. ఇక సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని ఓ సొసైటీలో సైతం పెద్దఎత్తున అక్రమాలు జరగడంతో ఫైళ్లను స్వాధీనం చేసుకొని విచారణ నిర్వహిస్తున్నారు. రుణమాఫీ విషయంలో అసలు, వడ్డీని తప్పుగా లెక్కించి తప్పుడు సమాచారాన్ని ప్రభుత్వానికి పంపించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఇదిలా ఉండగా నల్లగొండ జిల్లాలోని మునుగోడు నియోజకవర్గంలోని సొసైటీలో అక్రమాలు జరిగిన విషయంపై నల్లగొండ డీసీవో కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఆయా సొసైటీలో ఎలాంటి అక్రమాలు జరుగలేదన్నారు. రైతుల డేటా ఆలస్యంగా పంపారే తప్ప ఎలాంటి అవినీతి చోటుచేసుకోలేదన్నారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లాలోని కోదాడ మండలం ఓ సొసైటీలో రుణమాఫీ విషయంలో అవినీతి చోటుచేసుకున్నట్లు ఆరోపణలు రావడంతో ఆ జిల్లాకు చెందిన సహకార శాఖ అధికారులు విచారణ నిర్వహిస్తున్నారని డీసీసీబీ సీఈవో శంకర్‌రావు వివరణ ఇచ్చారు.

ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ


అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 9: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమ శాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేసి, మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీ హోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 13,54,435ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా నాగుల పంచమి పర్వదినాన మొదటి ఘాట్‌రోడ్డు వెంట ఉన్న పుట్ట వద్ద పుట్టలో పాలు పోసి, పసుపు, కుంకుమతో మహిళా భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కొండపైన స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

సాగర్‌కు కొనసాగుతున్న వరద

నాగార్జునసాగర్, ఆగస్టు 9 : నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి శుక్రవారం కూడా కొనసాగింది. దీంతో శుక్రవారం కూడా 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల చేస్తూనే ఉన్నారు. సాగర్ జలాశయానికి ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు, కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రం నుంచి 4,13,660 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590(312.5050టీఎంసీలు)అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి 587.70అడుగులుగా (305.9222టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8,680 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8,541 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,151 క్యూసెక్కులు, ఎస్ ఎల్‌బీసీ ద్వారా 1,800క్యూసెక్కులు, 26క్రస్ట్‌గేట్ల నుంచి 2,57,918 క్యూసెక్కులు మొత్తంగా 3,06,090 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


పులిచింతల ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న కృష్ణమ్మ

పర్యాటకుల సందడి

సాగర్ 26క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో కృష్ణమ్మ అందాలను తిలకించడానికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్‌కు తరలివస్తున్నారు. ఐదు రోజులుగా సాగర్‌కు పర్యాటకుల రాక కొనసాగుతూనే ఉంది. దీంతో ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే దారిలో, కొత్త వంతెన వద్ద పర్యాటకుల రద్దీ అధికంగా ఉంది. అంతే కాకుండా సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన అనుపు, ఎత్తిపోతల, బుద్ధవనం తదితర ప్రాంతాల్లో పర్యాటకుల రద్దీ నెలకొంది.

టెయిల్‌పాండ్ వద్ద..

దామరచర్ల: నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలకేంద్రం సమీపంలోని టెయిల్‌పాండ్‌కు ఎగువ నాగార్జునసాగర్ నుంచి పెద్దఎత్తున వరద కొనసాగుతోంది. దీంతో శుక్రవారం దిగువకు నీటివిడుదల కొనసాగించారు. సాగర్ నుంచి 3.63లక్షల క్యూసెక్కుల నీరు వస్తున్న నేపథ్యంలో టెయిల్‌పాండ్ 11గేట్లను 4.5మీటర్ల మేర ఎత్తి దిగువకు 2,53,880 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా నీటి విడుదలను కొనసాగిస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ జైపాల్ తెలిపారు.

పులిచింతలలోనూ..

మేళ్లచెర్వు : ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నిలకడగా కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175అడుగులు (45.77టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 167.78 అడుగులు (35.28టీఎంసీలు) నమోదైంది. ఎగువనుంచి 2,30,195 క్యూసెక్కుల వరద వస్తుండగా, 11 గేట్ల నుంచి ద్వారా 2,30,278 క్యూసెక్కులు, జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12వేల క్యూసెక్కులు మొత్తం 2,42,278 క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు. ఎడమ వైపున ఉన్న పులిచింతల ప్రాజెక్టులోని తెలంగాణ జెన్‌కో జల విద్యుత్ కేంద్రం నుంచి నాలుగు యూనిట్ల ద్వారా 12వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ, 80 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.


సాగర్ ప్రాజెక్ట్ ఎదుట సెల్ఫీ తీసుకుంటున్న పర్యాటకులు

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి : ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలనుంచి ప్రాజెక్టుకు 289.35 క్యూసెక్కుల వరద వస్తోంది. 645అడుగుల(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యంగల ప్రాజెక్టులో శుక్రవారం సాయంత్రానికి 641.55అడుగులుగా(3.58టీఎంసీ) నమోదైంది. మరోవైపు మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు ప్రాజెక్టు ఎడమ కాల్వకు 92.70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో కుడి కాల్వకు నీటి విడుదల నిలిపివేయాలని రైతుల విజ్ఞప్తిమేరకు నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు.

చదువుతో లోకాన్ని జయించాలి: వీరయ్య


సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

మిర్యాలగూడ, ఆగస్టు 9 : దివ్యాంగులందరూ పట్టుదలతో చదివి లోకాన్ని జయించాలని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన రాష్ట్రంలోని ఏకైక ఇంటర్ చెవిటి, మూగ విద్యార్థుల కళాశాలను ఆయన సందర్శించారు. కళాశాల లెక్చరర్స్, విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. మౌలిక సౌకర్యాల అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం అనే ఆయుధంతో ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టంగా చదవాలన్నారు. దివ్యాంగుల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థుల్లో మానసిక అభివృద్ధి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మధుకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

యూటీఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ టౌన్, ఆగస్టు 9 : రైల్వేశాఖ సాధారణ టికెట్‌ల కోసం రూపొందించిన యూటీఎస్ యాప్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కే కమలాకర్‌బాబు కోరారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఆయన యూటీఎస్ యాప్ వినియోగంపై ప్రయాణికులకు అవగాహన కల్పించి, మాట్లాడారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడకుండా సాధారణ రైల్వేటికెట్లను ప్రయాణికులు యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ ఎస్.రాజు, టీటీఐలు సుఖేష్, బాలకృష్ణ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


యాప్ వినియోగంపై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న కమలాకర్‌బాబు

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి, ఆగస్టు 9 : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ డీ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా భీమడోలు గ్రామానికి చెందిన కర్నాటి నాగరాజు(29) తాపీమేస్త్రి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం అతడితో పాటు మరోఇద్దరు కలిసి నల్లగొండ జిల్లా చిట్యాల మండలానికి సొంత ట్రాలీలో మొక్కజొన్న కంకులులోడ్ చేసుకొని బయలుదేరారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి మార్గమధ్యలో గురువారం అర్ధరాత్రి భోజనం చేసేందుకు నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటం శివారులోని హోటల్ వద్ద ట్రాలీబండిని ఆపారు. ఇతర అవసరాల కోసం రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు నాగరాజును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై నాగరాజు సోదరుడు కర్నాటి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి ...

భువనగిరి టౌన్, ఆగస్టు 9 : భువనగిరి రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం రైలు నుంచి గుర్తు జారిపడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న రైలు నుంచి గుర్తుతెలియని వ్యక్తి జారిపడి మృతి చెందాడు. మృతుడు సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగి ఒంటిపై నల్లని టీషర్ట్, నలుపు రంగు నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. మృతుడి ఆనవాళ్లు వివరాలు తెలిసిన వారు సెల్ నెంబర్లు 9848222169, 8712568454కు ఇవ్వాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 9 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పరిధిలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని చెట్లపొదల్లో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతదేహం సమీపంలో ఓ ప్లాస్టిక్ కవర్‌లో క్రిమిసంహారక మందుడబ్బా లభ్యమైంది. వ్యక్తిగత కారణంలో సుమారు 20రోజుల కిందటే సదరు వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉండవచ్చని, శరీరంపై తెలుపురంగు షర్టు, లైట్‌గ్రీన్ డిజైన్‌పూల లుంగి ధరించి ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. 8వ వార్డు కౌన్సిలర్ కమిలీ ఫిర్యాదు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

మునుగోడు రూరల్, ఆగస్టు 9 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం చొల్లేడు గ్రామంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చొల్లేడు గ్రామానికి చెందిన వంగూరు యాదయ్య, సాయమ్మకు ముగ్గురు కుమారులు కాగా చిన్నవాడైన నాగరాజు(24) గురువారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లి రాత్రి వరకు రాలేదు. దీంతో తల్లిదండ్రులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఉదయం తమ వ్యవసాయ భూమి వద్ద వెతకడంతో క్రిమిసంహారక మందు తాగి మృతి చెందిన నాగరాజు కనిపించాడు. తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని, నాగరాజు మృతికి కారణాలు తెలియరాలేదని ఎస్ఐ తెలిపారు.

అర్థాంతరంగా నిలిచిన రోడ్డు పనులు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 9: చౌటుప్పల్ పట్టణంలోని మార్కండేయ నగర్ నుంచి లింగారెడ్డి గూడెం వెళ్లే ఆర్అండ్‌బీ అడ్డ రోడ్డు వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనాల్సి వస్తోంది. రెండు నెలల క్రితం టీయుఎఫ్ఐడీసీ కింద సుమారు రూ.80 లక్షల అంచనాతో 1.25 కిలోమీటరు పొడవునా చేపట్టిన బీటీ రోడ్డు పనులను కంకర లేయర్ వేసి వదిలి వేశారు. కంకర రాళ్లు ప్రమాదకరంగా మారడంతో ఈ రోడ్డు వెంట వెళ్లాలంటేనే వాహనదారులు, ప్రజలు వణికిపోతున్నారు. ఈ రోడ్డు ప్రధానమైనది కావడంతో రాకపోకలు ఎక్కువగా సాగుతుంటాయి. పట్టణంలోని మార్కండేయనగర్ నుంచి వెళ్లే ఈ రోడ్డు వెంట వలిగొండ ప్రాంతానికి సంబంధించిన రాకపోకలు సాగుతుంటాయి. అదే మునిసిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం, తాళ్లసింగారం, లింగోజిగూడెం ప్రాంతాలతో పాటు మండలంలోని అనేక గ్రామాలకు ఈ లింక్ రోడ్డు ప్రధానమైనది. ఈ రోడ్డు వెంట వాహనాల రాకపోకలతో పాటు పాదచారులు ఎక్కువ సంఖ్యలో వెళుతుండడంతో ప్రాధాన్యం సంతరించుకుంది.


తారు వేసి, వదిలేసిన రోడ్డు

డబుల్ రోడ్డుగా మార్చాలని..

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నెల రోజుల క్రితం ఈ రోడ్డును పరిశీలించారు. మునిసిపాలిటీ పరిధిలో ప్రధానమైన ఈ లింక్ రోడ్డు ను డబుల్ రోడ్డు గా మార్చాలని, అందుకు తగిన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో సంబందిత అధికారులు సింగిల్ రోడ్డు నిర్మాణ పనులను అర్థాంతరంగా నిలిపివేయవలసి వచ్చింది.

వాహనదారుల ఇబ్బందులు

మునిసిపాలిటీలో ప్రధానమైన లింక్ రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పై పరిచిన కంకర లేయర్ ప్రమాదాలకు కారణంగా మారుతోంది. వాహనాల టైర్లు దెబ్బతినడంతో పాటు కంకర రాళ్లు ఎగిరిపడుతున్నాయి. దీంతో రోడ్డు వెంట ఉన్న ఇళ్లలోని వ్యక్తులతో పాటు నడుచుకుంటూ వెళ్లే వారికి తాకుతుండడంతో గాయాలకు గురవుతున్నారు.

రోడ్డు ప్రమాదకరంగా మారింది



కంకర వేసి వదిలి వేసిన ఈ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు వెంట ఉన్న ఫిల్టర్ ప్లాంట్ నుంచి ప్రతీ రోజు తాగునీటిని తీసుకువచ్చి ప్రజలకు అందజేస్తుంటాను. కంకర రాళ్లతో టైర్‌లు, ఇతర పరికరాలు దెబ్బతింటున్నాయి. తరచూ టైర్లు పంక్చర్ అవుతుండడంతో ఖర్చులు పెరుగుతున్నాయి. తాగు నీటి అమ్మకాలపై వచ్చే ఆదాయం కంటే ఖర్చులే ఎక్కువగా అవుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేయించి నష్టాల బారిన పడకుండా చూడాలి.

-మారగోని సురేష్ యాదవ్, తాగునీటి ఆటో ఓనర్ కమ్ డ్రైవర్, చౌటుప్పల్

రోడ్డు పనులు వెంటనే చేపతాం

బీటీ డబుల్ రోడ్డుగా నిర్మించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు రైతుల భూమిని సర్వే చేస్తున్నారు. 33 అడుగుల వెడల్పుతో భూమిని కేటాయించిన వెంటనే బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను చేపడతాం.

-వెన్నెల కుమార్, ఏఈ, ప్రజారోగ్యశాఖ, చౌటుప్పల్ మునిసిపాలిటీ

ఇలాగైతే మొక్కలు పెరిగేదెలా..?


ప్లాస్టిక్ కవర్లు తీయకుండానే గుంతల్లో నాటిన మొక్కలు

భువనగిరి టౌన్, ఆగస్టు 9: పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటి పరిరక్షించే లక్ష్యంతో భువనగిరి మునిసిపల్ పరిధిలో ఈ నెల 5 నుంచి 9 వరకు ఘనంగా స్వచ్ఛదనం- పచ్చదనం నిర్వహించారు. 5 రోజుల పాటు వీధి వీధిన నిలువ నీటిని శుభ్రం చేస్తూ మురికి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేస్తూ వేలాది మొక్కలు నాటారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని స్థానికులను మునిసిపల్ ముఖ్యులు కోరారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ నర్సరీల నుంచి సరఫరా అయిన మొక్కల వేర్ల భాగంలో ఉన్న ప్లాస్టిక్ కవర్లను తొలగించకుండానే గొయ్యిలలో మొక్కలను వేసి పై నుంచి పూడిక మన్ను వేయకుండా వదిలేశారు. దీంతో నాటిన మొక్కలు ఎలా పెరుగుతాయని పలువురు అంటున్నారు. పట్టణంలోని రెడ్డివాడతో పాటు పలు ప్రాంతాల్లో ఈ తరహాలోనే మొక్కలను హడాహుడిగా నాటినట్లు పలువురు అంటున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ సిబ్బంది స్పందించి మొక్కల కవర్లను తొలగించి పూడిక మట్టి వేయాలని స్థానికులు అంటున్నారు.

నానో ఎరువులతో భూసార పరిరక్షణ


కొలనుపాకలో డ్రోన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ సూరజ్‌కుమార్

ఆలేరు రూరల్, ఆగస్టు 9: నానో ఎరువులను వాడి రైతన్నలు భూసారాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఇఫ్కో జిల్లా మేనేజర్ సూరజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొలనుపాకలో నానో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటి వాడకంతో తక్కువ ఖర్చుతో మొక్కలను నత్రజని అందించవచ్చన్నారు. నానో యూరియా, డీఏపీ వాడే రైతులకు డ్రోన్ సదుపాయాన్ని కూడా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటేశ్వర్‌రావు, ఏవో దీప్తి, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ మల్లేశం, ఏఈవోలు రాఖిష్, శాలిని, శివ, నాగార్జున, రామకృష్ణ, రైతులు ఉన్నారు.

డీఆర్డీవో కృష్ణన్ బదిలీ

భువనగిరి అర్బన్, ఆగస్టు 9: జిల్లా డీఆర్డీవో ఎం.ఏ కృష్ణన్ శుక్రవారం బదిలీపై హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రత్యేకంగా ఆయనను కలెక్టర్ హనుమంతు కే.జెండగే సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బెన్‌షాలోమ్, గంగాధర్, భువనగిరి ఆర్డీవో అమరేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, నల్లగొండ నుంచి ఇక్కడకు బదిలీపై డీఆర్డీవో టీ.నాగిరెడ్డి సోమవారం వీధుల్లో చేరనున్నట్లు సమాచారం.

చేనేత కార్మికులకు సంఘాల్లో సభ్యత్వం ఇవ్వాలి


చేనేత జిల్లా ఏడీకి వినతి పత్రం అందజేస్తున్న చేనేత కార్మికులు

మోత్కూరు, ఆగస్టు 9: మగ్గం నేస్తున్న అర్హత కలిగిన చేనేత కార్మికులందరికి చేనేత సహకార సంఘాల్లో సభ్యత్వం ఇవ్వాలని కోరుతూ శుక్రవారం రాఘవాపురం, పాలడుగు గ్రామాల చేనేత కార్మికులు చేనేత జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు మగ్గం నేస్తున్న కార్మికులకు పాలకవర్గాలు సంఘాల్లో సభ్యత్వాలు ఇవ్వడం లేదని ఏడీ దృష్టికి తెచ్చారు. గుండు ఆనంద్, ఎలగందుల అంబదాస్, గుండు అరుణ్‌కుమార్, కూరపాటి బిక్షపతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మోత్కూరు : పట్టణ పరిధిలోని గాంధీనగర్‌లో ప్రాథమిక పాఠశాల పక్కన, ఇళ్ల మధ్య చెత్తా చెదారం పేరుకుపోయి పాములు, తేళ్లు వస్తుండటం, దోమలు పెరుగుతుండటంతో కాలనీ వాసులు ఆ విషయాన్ని యూత్ కాంగ్రెస్ నాయకుడు మెంట నగేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే ఎక్స్‌కవేటర్‌తో చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేశారు. కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

మోత్కూరు: పట్టణంలోని నిరుపేద పద్మశాలి తాటి అరుణ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఆమె దహన సంస్కారాల నిమిత్తం దాతల నుంచి సేకరించిన విరాళాల్లో ఖర్చులు పోను మిగిలిన రూ.9,050 శుక్రవారం మృతురాలి కుమారులకు అందించారు. కూరపాటి రాములు, పెండెం శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : కేరళ వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి కోరారు. పట్టణంలో శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కేరళ వరద బాధితుల సహాయార్థం విరాళాలను సేకరించారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు చీరిక సంజీవరెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె మధుకృష్ణ, నాయకులు పొట్ట శ్రీనివాస్, చీరిక అలివేలు, బోయ యాదయ్య, రాఘవ రెడ్డి, యాట ముత్యాలు, బోదాసు వెంకటేశ్, శేఖర్, ఆకుల ధర్మయ్య పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్/ సంస్థాన్‌నారాయణపురం: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి లక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం చౌటుప్పల్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, మాజీ సర్పంచ్‌లు పబ్బు రాజు, పాశం సంజయ్ బాబు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల కమిటీ అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్యారాణి, కాంగ్రెస్ బ్లాక్, మండల అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనా రెడ్డి, బోయ దేవేందర్‌లు పాల్గొన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఏపూరి సతీష్,నాయకులు మందుగుల బాలకృష్ణ, బిక్షపతి నాయక్, జక్కిడి చంద్రారెడ్డి, కొన్‌రెడ్డి నరసింహ పాల్గొన్నారు.

వలిగొండ: గర్భిణులు, స్త్రీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి తెలిపారు మండలంలోని గొల్లపల్లి గ్రామం అంగన్‌వాడీలో రక్తహీనతపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ పారిజాత, పాఠశాల ప్రధానోపాధ్యయులు కళావతి, అంగన్‌వాడీ టీచర్లు ఇందిరా, భాగ్యలక్ష్మీ, వసంత, ఆశాలు సుష్మ, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : బిడ్డ ఆరోగ్యంగా ఎదగడానికి తల్లి పాలు చాల శ్రేష్టమైనవని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ధనమ్మ, ఆయాలు సునంద, సుజాత పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: బాధిత రైతు కుటుంబాలకు అండగా ఉండి ఆదుకుంటామని చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రంబెల్లికి చెందిన మహిళ రైతు నోముల గౌరమ్మ (65) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 30వేల నగదు ఆర్థిక సాయం అందచేశారు.

చౌటుప్పల్ టౌన్ : బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీల పై జరుగుతున్న అమానుష చర్యలను భారతీయులంతా ఖండించాలని బీజేపీ మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరు వీరారెడ్డి కోరారు. చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారిపై బీజేపీ అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కౌన్సిలర్ పి.శ్రీధర్‌బాబు, మల్లేశం, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: చేనేత కార్మికులకు ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలను అందరికి అందే విధంగా కృషి చేస్తానని పద్మశాలి పట్టణ అధ్యక్షుడు ఎర్రగుంట శ్రీనివాస్ తెలిపారు. పద్మశాలి పభవనంలో పట్టణ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు.

వలిగొండ: వాహనదారులు రోడ్డు నిబంధలను పట్టించాలని ఎస్ఐ మహేందర్ తెలిపారు. మండలం కేంద్రంలో స్పీడ్ బేకర్లకు తెలుపురంగు గుర్తులు వేశారు.

వలిగొండ: అమ్మ ఆదర్శ పాఠశాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని లోతుకుంట గ్రామంలో ఆదర్శ పాఠశాల కేజీబీవీ బాలికల వసతి గృహలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 రోజుల్లో పనులను పూర్తి చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 9: నాగుల పంచమి పురస్కరించుకుని శుక్రవారం భూదాన్‌పోచంపల్లి పట్టణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహమ్మాయి దేవాలయం, అయ్యప్ప దేవాలయం వద్ద పుట్టల్లో పాలు పోసి, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, మహిళా భక్తులు నాగేంద్రస్వామికి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహమ్మాయిదేవి ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. పరిధిలోని దేశ్‌ముఖి గ్రామశివారులోని సాయిబృందావనం క్షేత్రంలో విశ్వశాంతి సాయిసేవా, ప్రచార్ సమాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ ఘంటా నారాయణస్వామిజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో నాగేంద్రస్వామికి పూజలు నిర్వహించారు.


పోచంపల్లిలో పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

వలిగొండ: మండల కేంద్రంలో హరిహర త్రిశక్తి క్షేత్రంలో మహాకాళి, మహలక్ష్మీ, మహాసరస్వతి అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలో నాగదేవతను మహిళా భక్తులు పాలతో అభిషేకించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

చౌటుప్పల్ టౌన్ : పట్టణంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో మహిళా భక్తులు కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాశీ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన యంత్రాలపై చేసిన కుంకుమార్చన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్లోబల్ ఫ్యామిలీ కమిటీ అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శి పోలోజు శ్రీలత, ఎం.నీరజ, బి.సంధ్య, ట్రినిటీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ వి.మంజుల, బి.మురళి, పి.శ్రీలతాచారి, చంద్రశేఖర్, వెంకటేశం, టి.నర్సింహ పాల్గొన్నారు.


చౌటుప్పల్‌లో బోనాలు ఎత్తుకున్న విద్యార్థినులు

● చౌటుప్పల్ పట్టణంలోని నలంద, అరవిందో కళాశాలల విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు బోనాల జాతర నిర్వహించారు. శాంతి నగర్‌లోని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ పోలు విష్ణుకుమార్, చిలువేరు దుర్గయ్య, కరస్పాండెంట్ రాజశేఖర్, కట్టెల లింగస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం: నాగులపంచమి పర్వదిన సందర్భంగా మర్యాల గ్రామంలో శుక్రవారం చెన్న కేశవస్వామి ఆలయానికి వచ్చిన భక్తులకు దాత ముద్దం ఉదయ్‌కుమార్‌రెడ్డి పులిహోర ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుమారుగా 900మందికి వితరణ చేశారు. తాజా మాజీ వార్డు సభ్యులు అన్నారం గణేష్, అన్నారం శ్రీధర్, భువనగిరి అనిల్, శేఖర్, బండ పాండు, సంధగల్ల నవీన్ ఉన్నారు.

తుర్కపల్లి : మండలంలో మహిళలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు పుట్ట వద్ద పసుపు, కుంకుమలతో అలంకరించి నైవేద్యం సమర్పించి పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో పోరాడాలి

భువనగిరి టౌన్/ రామన్నపేట/ ఆలేరు రూరల్, ఆగస్టు 9: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో రైతులు, కార్మికులు మోదీ ప్రభుత్వ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు అన్నారు. క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మోదీ విధానాలపై శుక్రవారం భువనగిరిలో తెలిపిన నిరసనలో నాయకులు మాట్లాడారు. లేబర్ కోడ్‌లను ఎత్తివేయాలని నూతన చట్టాలను సమీక్షించాలన్నారు. బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేసే విధానాలను విరమించుకోవాలని, రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను అడ్డుకుంటామన్నారు. వ్యవసాయ రంగంలో అమెజాన్ తదితర కార్పొరేట్ సంస్థల పరిశోధన ఒప్పందాలను కేంద్రం రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాసరి పాండు, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు సామల శోభన్ బాబు, వెంకటేష్, భాస్కర్, లక్ష్మయ్య, సోములు, ఎండీ.షరీఫ్, రాఖేష్ పాల్గొన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటర్లకు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను కేంద్రం ఉపసంహరించుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు. రామన్నపేటలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తెలిపిన నిరసనలో ఆయన మాట్లాడారు. నాయకులు గొరిగె సోములు, బొడ్డుపల్లి వెంకటేష్, గనబోయిన విజయ భాస్కర్, బోయిని ఆనంద్, గాదె నరేందర్, లింగస్వామి పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు ఆరోపించారు. ఆలేరులో కార్పొరేట్ లూటర్స్ క్విట్ ఇండియా నినాదంతో ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు మంగ నర్సింహులు, ఆర్ జనార్ధన్, చెక్క వెంకటేష్, గడ్డం నాగరాజు, అడివయ్య, సహదేవ్, సుదర్శన్, కొమురయ్య, పరుశరాములు, గణేష్ ఉన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘాల నాయకులు

యువజన కాంగ్రెస్‌ను పటిష్ఠం చేయాలి


చౌటుప్పల్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 9: యువజన కాంగ్రెస్‌ను పటిష్ఠం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పనిచేయాలని పలువురు నాయకులు అన్నారు. స్థానిక రాజీవ్ భవన్‌లో శుక్రవారం యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కేక్ కట్ చేసి, యువజన కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మాదగోని శేఖర్‌మేకల ప్రమోద్‌రెడ్డి, రాచకొండ భార్గవ్, పెద్దగోని రమేష్, ఎ.రామకృష్ణ, కొండూరు ధర్మేందర్, శ్రీనివాస్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మోటకొండూరు: యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బుగ్గ మహేష్ అధ్వర్యంలో జెండాను ఎగరవేశారు. నాయకులు సంగు శేఖర్, బుగ్గ శ్రీనివాస్, జూకంటి మధు, రేగు రమేష్, జంగవెల్లి రాజశేఖర్, అద్దమడుగు నాగరాజు, బాల్ద మధు, సిద్దులు, రంజిత్, రమేష్, మణి, మహేందర్ ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి జింకల కుమార్, గ్యార సందీప్, జింకల జయసూర్య, జి.మహేష్, ఎజాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ: స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యుత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు లింగస్వామి, అధ్యక్షులు నగేష్, నాయకులు వరుణ్, అరుణ్, నరేందర్, వినోద్, ప్రవీణ్, ఉదయ్, వినేష్, మనోజ్ శివ, విన్ను పాల్గొన్నారు.

పచ్చని చెట్లు-ప్రగతికి మెట్లు

భువనగిరి రూరల్, ఆగస్టు 9: పచ్చనిచెట్లు ప్రగతికి మెట్లు అని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి భావితరాలకు అందించాలని జిల్లా పరిషత్ సీఈవో ఎస్.శోభారాణి అన్నారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా వనమహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జడ్పీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. సూపరింటెండెంట్ కె.రమేశ్‌రెడ్డి, సుధాకరచారి, కె.రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్, శివ పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: ఐదు రోజుల స్వచ్ఛదనం, పచ్చదనంతో బస్తీల్లో పారిశుధ్య సమస్యలు తగ్గి పచ్చదనం పెరిగిందని మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం ముగింపు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు.

మోత్కూరు, ఆగస్టు 9: వాతావరణ కాలుష్యం తొలగి భావి తరాలకు స్వచ్ఛమైన గాలి అందాలన్నా, మనుషుల జీవన ప్రమాణాలు పెరగాలన్నా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని మోత్కూరు మునిసిపల్ చైర్ పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా శుక్రవారం జామచెట్లబావి గ్రామంలో ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కమిషనర్ చెన్నిశ్ల శ్రీకాంత్, కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, కూరెళ్ల కుమారస్వామి, దబ్బెటి విజయరమేష్, కోఆప్షన్ సభ్యురాలు పోలినేని ఆనందమ్మస్వామిరాయుడు, ఎండి.షాహిన్ సుల్తాన పాల్గొన్నారు.

రామన్నపేట: ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంక్షించాలని స్థానిక తహసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీవో భూక్యా యాకూబ్ నాయక్ కోరారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఏపీవో పున్న వెంకన్న, గ్రామపంచాయతీ కార్యదర్శి ఖదీర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


జడ్పీ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న సీఈవో శోభారాణి

వలిగొండ: మండలంలోని వెంకటాపురం గ్రామపరిధిలోని శ్రీ మత్స్యగిరి గుట్టపైన మొక్కలు నాటారు. ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, ఏపీవో పరుశరాములు ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ పరిధిలోని 8వ వార్డులో పద్మశ్రీ టౌన్‌షిప్ వెంచర్‌లో మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఫ్రైడే-డ్రైడే పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కె వీరారెడ్డి, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామియాదవ్, కౌన్సిలర్లు సామల మల్లారెడ్డి, గుండు మధు, బోగ భానుమతి విష్ణు, దేవరాయ కుమార్, మోడల్‌స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

'రావి' కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయాలి


అమెరికాలో సీఎం రేవంత్‌రెడ్డితో రావి అనిల్‌రెడ్డి, కొండగడప గ్రామానికి చెందిన శ్రీకర్‌రెడ్డి

భువనగిరి రూరల్, ఆగస్టు 9: ఉత్తమ పార్లమెంటేరియన్, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, తెలంగాణ సాయుధ పోరాట యెధుడు రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయాలని రావి సేవా సంస్థ సభ్యుడు అనిల్‌రెడ్డి కోరారు. ఈమేరకు అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డిని రావి నారాయణ రెడ్డి సేవ సంస్థ సభ్యులు, అమెరికా విభాగం ప్రతినిధి అయిన రావి అనిల్‌రెడ్డి శుక్రవారం ఆయనను కలిశారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్, భువనగిరి జిల్లా కేంద్రంలో కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంస్య విగ్రహాల ఏర్పాటుతో పాటు నాగిరెడ్డిపల్లిలోని రైల్వే స్టేషన్‌కు, భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెంలో ఏర్పాటు చేస్తున్న మినీ స్టేడియానికి రావి నామకరణం చేయాలని కోరారు.

మోత్కూరు: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు కాలిఫోర్నియా వెళ్లగా అక్కడ కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియాగా పనిచేస్తున్న మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన శ్రీకర్‌రెడ్డి తదితరులు వారికి ఘనంగా స్వాగతం పలికారు.

ఆధ్యాతిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 9: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వంకమామిడి గ్రామంలోలోని ఆలయంలో సురమాంబ సమేత కంఠమహేశ్వరస్వామి, రేణుకా ఎల్లమ్మదేవి, వనం మైసమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని దేవాలయ ఉత్సవాల్లో యువకులు, ప్రజలు పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా నిర్వహించుకోవాలన్నారు. ఉత్సవాల్లో గౌడ సంఘం అధ్యక్షుడు సుర్వి సత్యనారాయణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు సామ రవీందర్‌రెడ్డి, బొడిగె శంకరయ్యగౌడ్, సుర్వి రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ బత్తుల మాధవిశ్రీశైలంగౌడ్, నాయకులు పెద్దగౌడ్, మునుకుంట్ల రామచంద్రంగౌడ్, బొడిగె మల్లయ్య, సుర్వి శివ, మల్లేష్, కాసుల శ్రీనివాస్, కుమార్, గణేష్, భిక్షపతి, నోముల మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 9: ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. పట్టణంలోని 14 వ వార్డులో గల ముత్యాలమ్మ దేవాలయానికి మునిసిపల్ కౌన్సిలర్ (దాత) గోపగోని లక్ష్మణ్ గౌడ్ తన తండ్రి బుచ్చయ్య, సతీమణి సుజాత ల జ్ఞాపకార్థం రూ. 5 లక్షల అంచనాతో నిర్మిస్తున్న ఆర్చీ (కమాన్) కు శుక్రవారం చైర్మన్ రాజు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు సదగళ్ల సతీష్, ఏఎంసీ మాజీ చైర్మన్ బడుగు లక్ష్మయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్ గౌడ్, మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్‌లు ఎస్. విజయ, పి. శ్రీధర్ బాబు, కె. సైదులు, బొడిగే భాలకృష్ణ, కామిశెట్టి భాస్కర్, ఉబ్బు వెంకటయ్య, కె. శ్రీనివాస్ రెడ్డి, ఊడుగు రమేష్, తాడూరు పరమేష్, ఎ. బాల రాజ్ , జి. సురేందర్ రెడ్డి, నల్ల పర్వతాలు పాల్గొన్నారు. అంతకు ముందు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఆర్చీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

మినీ డీసీఎం బోల్తా: ట్రాఫిక్ జామ్

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 9: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం జాతీయ రహదారిపై మినీ డీసీఎం బోల్తా పడటంతో శుక్రవారం భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు పాత టైర్ల లోడుతో వెళుతున్న మినీ డీసీఎం ఆందోల్‌మైసమ్మ ఆలయం సమీపంలో జాతీయరహదారిపై రోడ్డుకు అడ్డంగా బొల్తా పడింది. దీంతో కిలో మీటర్ మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్ సీఐ విజయ్‌మోహన్ సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. క్రేన్ సాయంతో వాహనాన్ని తొలగించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.


మల్కాపురం సమీపంలో బోల్తాపడిన డీసీఎం

పటేల్‌గూడెంలో ట్రాక్టర్ దహనం

ఆలేరు రూరల్, ఆగస్టు 9: తనకు చెందిన వ్యవసాయ ట్రాక్టర్‌ను కొంతమంది కక్షపూరితంగా దహనం చేశారని మండలంలోని పటేల్‌గూడెంకు చెందిన మాజీ సర్పంచ్ భర్త పులుగం యాదిరెడ్డి శుక్రవారం ఆలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు చెందిన రూ.8లక్షలకు విలువైన ట్రాక్టర్, రోటరేటర్‌పై పెట్రోల్ చల్లి దహనం చేశారన్నారు. సంఘటనా స్థలానికి ఎస్ఐ వెంకట శ్రీను చేరుకుని పంచనామా నిర్వహించారు. దీనికి కారణమైన వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

54 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

రామన్నపేట, ఆగస్టు 9: మండలంలోని సిరిపురం గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన 54 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ సివిల్ సప్లై అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఓ వ్యవసాయ బావి వద్ద పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ గౌస్, సివిల్ సప్లై డీటీ బాలమణి దాడులు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నింధితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, సరఫరా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.